జీవులన్నీ మూగబోయిన వేళ!

వెలుగును ఓడించి చీకటి విశృంఖలంగా స్వైరవిహారం చేస్తున్న సమయం ..... మనిషి సుఖదు:ఖాలకు, పెద్దా గొప్ప తారతమ్యాలకు చరమగీతం పాడే ప్రదేశం .....

పిశాచాల్లా కదులుతున్న వృక్షాల సముదాయం .....

ఆ వృక్షాల ఛాయలో .....

ధ్యానంలో ఓ జటధారి--

అతని ధ్యానానికి శూన్యంలోంచి సన్నగా ప్రారంభమైన గాలి అలలై, అలలు ఘోషయి, ఘోష భీకరమై, అపశృతులతో ఒడలు జలదరింపచేసే నవ్వులాంటి ఏడుపు, ఏడుపులాంటి నవ్వు ..... అది అంతవరకూ పెరిగి అండపిండ బ్రహ్మాండాలని కదిపి కుదిపేసేలా రూపాంతరం చెందింది.

హాస రోదనల సంగీతం గాలి హోరును కాలరాచి కరాళనృత్యం చేస్తోంది. కర్ణభేరిని బద్దలు చేస్తుందా అన్నట్టు విర్రవీగిపోతోంది.

శూన్యంలోంచి మెరిసి మాయమైపోతున్నాయి.

చెట్లమీద పక్షులు భయంతో మరింత ముడుచుకున్నాయి. దక్షిణం దిక్కునుంచి 'హో' అనే హోరు మునుపటి రోదనలతో కలిసిపోయి మరుభూమే ఒక రణభూమిగా మారనుందా? అన్పిస్తోంది.

ప్రభంజనం ప్రళయఘోషతో వికటిస్తోంది. భ్రష్ట రోదనలు శక్తి పుంజుకున్నాయి.

తీతువు వికృతంగా అరిచింది.

గుడ్లగూబ గుబులుగా చూసింది.

చరాలు అచరాలై చేష్టలుడిగిఉన్నచోటునే వుండిపోయాయి. ఆకాశం పెద్దగా గర్జించింది. పుడమి భయంతో వణికిపోయింది.

ఆ ఝటాధారి ముల్లోకాలూ కదిలిపోయేట్టు బిగ్గరగా మంత్రాలు పఠించసాగాడు.

ఓం నమ: కర్ణపిశాచినీ అమోఘ సత్యవాది మమకర్ణే

అవతారావతరాతీతా నాగత్‌వర్తమానాని దర్శయ దర్శయ మమ

భవిష్యం కథయ హ్రీం కర్ణపిశాచిని స్వాహా!!

ఆ మంత్రపఠనానికి దిక్కులు దద్దరిల్లిపోయాయి. శూన్యంలో కదలాడుతున్న నీడలు క్షణమాత్రంలో కనుమరుగైపోయాయి.

ఏదో అదృశ్యశక్తి తోడ్కొని పోతున్నట్లు అప్పటిదాకా స్వైరవిహారం చేసిన హోరు క్రమక్రమంగా తగ్గిపోయింది. శ్మశాన నిశ్శబ్దం! జీవుల ఆఖరి మజిలీ అయిన శ్మశానంలోనే శ్మశాన నిశ్శబ్దం. మనుషుల్ని భయభ్రాంతులకు. చిత్తభ్రమలకూ గురిచేసే నిశ్శబ్దం. విస్ఫోటనానికి ముందున్న ప్రశాంతత. తాంత్రికుడు ఎటూ కదలక కూర్చున్నాడు.

క్షణాలు నిమిషాలవుతున్నాయి. ఆకాశం నల్లని మేలిముసుగు కప్పుకున్నట్టుంది.

తారలు, చంద్రుడు కానరాని లోకాలకు తరలిపోయినట్లుంది బోసిపోయిన దివి. అదే సమయంలో మళ్ళీ హోరు మొదలైంది. దక్షిణంవైపు నుంచి. క్రమక్రమంగా దగ్గరై తాంత్రికుడి చుట్టూ తిరుగుతోంది. చెవి వొగ్గి వింటున్నట్లు ఒకవైపు వంగి తలాడించాడతను.

మరుక్షణం లేచి నించున్నాడు. గాలి హోరు దక్షిణం వైపునుంచి సర్దుమణిగిపోయింది. క్షణంలో వాతావరణం మామూలుగా అయిపోయింది. చరాలు చలించాయి. పక్షులు కువకువలాడాయి. తాంత్రికుడు నైరుతి దిక్కుగా సాగిపోయాడు.

* * * * *

మహదేవ్‌కెందుకో ఆ రాత్రి నిద్రపట్టడంలేదు! మనసు గోదావరి అలలపై ఊయలూగుతున్న భావన. ఖాళీపాత్రలో జీవన మధువు నిండిపోయి ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేసే ఆనందం.

కిటికీ సందులోంచి వెన్నెల ఆబగా వచ్చి చెవిలో గుసగుసలాడుతున్న తలంపు. తనువులోని అణువుణువూ హిమబిందువుల్ని స్పృశించి నాట్యమాడే మయూరంలా నర్తిస్తున్న అనుభూతి!

అధరాలు ఇది అని చెప్పలేని ఆనంద సంకేతాలై దరహాస రేఖల్ని చిందిస్తున్న వేళ! హిమవర్షంలో తడిసి ముద్దయిన జంటకపోతాలు గుబురుకొమ్మల సందుల్లో పక్కపక్కనే ఒకదానికొకటి ఒత్తుకుని శరీరాల్ని నులివెచ్చగా మలుచుకుంటున్న అపురూప దృశ్యం కలకాని ఇలలోనే కళ్ళెదుట కన్పిస్తూ కవ్విస్తున్నట్లుంది.

"ఏమైందీ రోజు తనకి? ఎందుకింతగా మనసు స్పందిస్తోంది' అనుకున్నాడతను.

అప్పుడు గుర్తొచ్చిందా ..... కాదుకాదు ..... మరచిపోతే కదా గుర్తురావటానికి ..... ఈ భావాలన్నింటికీ కారణం మనస్విని త్వరలో తన అర్థభాగం కాబోతుందన్న ఒకే ఒక విషయానికి తన మనసు రాగరంజితమై సుస్వరాల్ని పలికిస్తోంది.

కిటికీలోంచి బయటకు చూశాడతను. నీలాకాశం అతనివంకే అసూయగా చూస్తున్నట్లుంది. మనస్వినిలాంటి అందాలరాసిని పొందబోతున్న అతన్ని చూసి నీలాకాశమే కాదు ..... ముల్లోకాల్లోని పురుషులు సైతం అసూయ చెందకేం చేస్తారు?

తననే చూస్తున్న మహదేవ్ చూపులతో చూపులు కలిపి ఏదో పనున్నట్టు శశాంకడు మబ్బులమాటుకు ఒదిగిపోయాడు. తారలు వెలుగుతూ, ఆరుతూ అతనికి అభినందన సంకేతాలు పంపుతున్నాయి.

పిల్ల తెమ్మెర నైట్ క్వీన్ పరిమళాల్ని మోసుకొచ్చి అడ్వాన్స్ గ్రీటింగ్స్ అందజేస్తోంది. గాలికి కదలాడిన కొబ్బరాకు శుభాభివందనలందజేస్తోంది. మహదేవ్‌కి మనస్విని పరిచయమైన వైనం గుర్తుకొచ్చింది.

'ఆ రోజు తను జూబ్లీహిల్స్ వైపు బైకుమీద వెళుతున్నాడు. జనం ఎవరి హడావుడిలో వాళ్ళు మూడో ప్రపంచయుద్ధం ముంచుకొచ్చినట్లు ఉరుకులు పరుగులతో జీవన సమరంలో

ఈదులాడుతున్నారు. ఈ మనుషులకెందుకంత యాతన? ఎప్పుడూ కొంపలంటుకుపోయినట్టు ప్రవర్తిస్తారు?

వీళ్ళలో ఎంతమంది మంచుతెరల బద్దకాన్ని వదిల్చి. ఉదయించే సూర్యుడ్ని చూసుంటారు? ఉహు ..... ఎవరూ చూసుండరు ..... పోనీ సంజ కెంజాయ వర్ణంలో మరునాడు మరింత ఉత్సాహాన్ని నింపుకు రావటానికి పడమర కొండల్లోకి జాలువారే సూర్యాస్తమయాన్ని చూసుంటారా? అదీ అనుమానమే.

డబ్బు సంపాదన ధ్యేయంగా గొడ్డుల్లా ఓవర్‌టైమ్‌లు, సైడ్ బిజినెస్సులూ, చేస్తూ ఆదమరచిపోయి గుర్రుపెడుతూ ప్రభాతవేళల పక్షుల కిలకిలారవాలూ, ఉషోదయాలూ చూడరు.

ఫెళఫెళలాడే నోట్లకట్టలు కళ్ళముందు ఊహించుకుంటూ సాయం సంధ్య వేళల్లో మబ్బులకు హారాలై ఆహారన్వేషణ ముగించుకుని తమ గూళ్ళకు చేరుకునే పక్షుల్నీ, సూర్యాస్తమయాన్నీ చూడరు.

వీళ్ళకి జీవితంలో తామేం కోల్పోతున్నారో తెలియదు. పోనీ తెలియచెబితే విన్పించుకుంటారా? అదీ లేదు' అనుకుంటూ మెల్లగా బైక్‌మీద వెళుతుంటే నల్లని తారురోడ్డుమీద దర్శనమిచ్చింది అందంగా, పొందిగ్గా వున్న గులాబీ వర్ణపు లేడీస్ పర్స్!

అతను బైక్ ఆపి దాన్ని అందుకుని జిప్ తీసి చూశాడు. కొన్ని వందరూపాయల నోట్లూ, పదులు, అయిదులూ, కొంత చిల్లర. దాంతో పాటే కొన్ని విజిటింగ్ కార్డ్స్, బస్సు పాస్! తను బస్‌పాస్ తెరచిచూశాడు. అందులోని ఫోటోచూసి తన హృదయం ఒక్కక్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది.

వివరాల కోసం చూశాడతను. ఆమె పేరు మనస్వి అనీ, ఉమెన్స్ హాస్టల్‌లో వుంటుందని తెలిసింది. వెంటనే బైక్ స్టార్ట్‌చేసి అడ్రసులో వున్న హాస్టల్ చేరుకున్నాడు.

"కౌన్ చాహియే?" గూర్ఖా అడిగాడు. అతనికో యాభై ఏళ్ళుంటాయి.

"మనస్విని" బదులిచ్చాడతను.

"తోడీ సమయ్ మే ఆఫీస్ పే ఆయేగి. ఆప్ కౌన్ హై?" సీరియస్‌గా అడిగాడు.

'తనకామె పర్స్. బస్‌పాస్ దొరికాయని చెబితే అవి తీసుకుని తానందజేస్తానంటాడితను. అందులో డబ్బు గోల్‌మాల్ చేసే అవకాశం వుంది. అదీగాకుండా ఇంత అందాల భరిణను చూడకుండా ఈ వెధవ చేతికి పర్సిచ్చి వెళ్ళిపోతే ఎలా? తనామెను చూడాలి ..... తప్పకుండా చూడాలి' అనుకుని--

"మై ఉన్‌కీ కజిన్ హుఁ ..... " అని బదులిచ్చాడు.

అతడు నిర్లక్ష్యంగా తలూపి వూరుకున్నాడు.

'ఇక్కడుంటే విషయం వీడికి తెల్సిపోతుంది. కాస్త దూరంలో వుండా'లనుకుని. "అభీ ఆతామై!" అంటూ హాస్టల్‌కి దూరంగాపోయి వెయిట్ చేయసాగాడు. వచ్చేపోయే

అమ్మాయిల్ని చూస్తున్నాడు.

రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ని చూస్తే మొట్టబుద్ధేస్తుందన్న సామెతలా -- మనస్విని ఫోటోలో ఆమె అందాన్ని చూసిన తనకి, వారందరూ సూర్యునిముందు దివిటీల్లా అనిపించసాగారు.

సమయం ఆగిపోయిందా అన్నట్టు భారంగా కదులుతోంది. అన్నింటికంటే దుర్భరమైనది కోరుకున్నవారి కోసం నిరీక్షించడమే అన్న సత్యం మొదటిసారిగా తనకి తెలిసివచ్చింది.

సమయం సాయంత్రం అయిదున్నర అవుతోంది. తను దీర్ఘంగా విశ్వసించాడు. ఇంతలో దూరంగా వస్తూ కన్పించిందామె. లక్షమందిలో వున్నా ఇట్టే పోల్చుకోగల ప్రత్యేకత ఆమెలో ప్రధాన ఆకర్షణ.

తనకి ఎగ్జయిటింగ్‌గా వుంది. ఉద్యోగరీత్యా యింతకుముందు ఎందరో అమ్మాయిలతో మాట్లాడినప్పుడు అప్పుడేం ఫీలింగ్స్, నెర్వస్‌నెస్ ఎదురుకాలేదు. కానీ ఇంకొన్ని క్షణాల్లో ఆమెతో మాట్లాడబోతున్నానని అనుకుంటే ఏదో తత్తరపాటు. అదే మనసు చేసే గారడీ!

ఆమె తనని సమీపిస్తోంది!

కూర్చున్న బైక్‌మీద దిగి నిల్చున్నాడతను.

మరింత దగ్గరైందామె. ఆమె నడకలోని హొయలుకి మయూరాలు సైతం సిగ్గుపడుతాయోమో అన్పించింది.

మొహంలో ప్రసన్నత, నిలుచున్న తీరులో బుద్ధిమంతుడి లక్షణాలు, చేతుల్లో మర్యాదలలో ఆమెని పిలవటానికి సంసిద్ధుడయ్యాడతను.

ఆమె తన పక్కనుంచే వెళుతోంది.

“మనస్వినిగారూ” పిలిచాననుకున్నాడతను.

అయితే గొంతుదాటి మాటలు బయటకు రాలేదని ఆమె ఆగక ముందుకు సాగిపోవడంతో తెలిసింది.

తన అవస్థని గమనిస్తున్న ఎదురుగా వున్న ఇంట్లోని పదేళ్ళ పాప కిసుక్కున నవ్వింది.

‘వెధవ టీ. వీ. లు, సినిమాలు. చిన్నపిల్లలక్కూడా అన్నీ తెలిసిపోతున్నాయి’ ఆ పిల్ల నవ్వటం చూసి కసిగా అనుకున్నాడతను. అప్పుడే తనలో పట్టుదల వచ్చింది. గుండెనిండా గాలి పీల్చుకున్నాడు. కాస్త ధైర్యమొచ్చినట్లయింది.

“మనస్వినిగారూ!” ఈసారి కాస్త గట్టిగా పిలిచాడు.

ఓ అపరిచిత స్వరం తన పేరుని పలకటంతో, ఆమె ఆశ్చర్యంగా వెనుదిరిగి చూసింది,

అల్లరి చేయడానికి పిలిచాడనుకుందేమో- ఒక్కక్షణం అనుమానంగా చూసింది. అయిదడుగుల పదంగళాల ఎత్తుతో, కోటేరు ముక్కుతో, బొద్దుమీసాలతో మర్యాదస్తుడిలానే

కనిపించివుంటాడు. "ఏమిటి?" అన్నట్టు నావైపు ప్రశ్నార్థకంగా చూసింది.

నా మతిమరుపుకి నాకే చిరాకొచ్చింది. 'ఆమె పర్సు చేతిలో రెడీగా పట్టుకుని పిలిస్తే ఇంత సీన్ క్రియేట్ అయ్యేది కాదు కదా' అనుకుని చటుక్కున జేబులోంచి ఆమె పర్సుతీస్తూ-- "జూబ్లీహిల్స్ రోడ్‌మీద దొరికింది" మర్యాదగా అందించాను.

ఆమె నా చేతిలోంచి పర్సు అందుకుని ముందు బస్‌పాస్‌నీ, తరువాత డబ్బుల్నీ జాగ్రత్తగా లెక్కపెట్టుకుంది. 'డబ్బు లెక్క చూసుకోండి' అని తనంటే ఆమె ఫర్వాలేదండీ' అని అంటుందని వూహించుకున్నాడు. కానీ తనామాట చెప్పకముందే తనని హర్ట్ చేసేలా ఆమె డబ్బు లెక్క పెట్టుకోవడంతో మనసులో బాధ పడ్డాడు తను.

"చాలా థాంక్సండీ!" లెక్క సరిపోయింది కాబోలు ముక్తసరిగా అని వెనుదిరిగందామె.

"ఒక్కనిమిషం" తనామెను ఆపాడు. ఆమె ఆగింది.

"ఇందాక మీ హాస్టల్ గూర్ఖాతో మాట్లాడుతూ నన్ను మీ కజిన్‌గా చెప్పాను. అసలు విషయం చెబితే ఆ పర్సు తీసుకుని డబ్బు కాజేస్తాడని అలా చెప్పాను. అతను మీ కజిన్ వచ్చివెళ్ళాడని అంటే కంగారుపడకండి" అన్నాడతను.

"అలాగా! మీరనుకుంటున్నట్టు ఆ గూర్ఖా అటువంటివాడు కాదు. మీరతనికి పర్సు ఇవ్వకపోవటానికి కారణం నాకు తెలుసు. పర్సు ఇస్తూ నాతో పరిచయం చేసుకుందామని, ఈ ఫోటోలో అమ్మాయి ఎలా వుంటుందో తెలుసుకోవాలనే అలా చేశారు ..... " తన మొహంమీద కొట్టినట్టు చెప్పిందామె.

దాంతో తన మొహం మ్లానమైంది. ఆమె హాస్టల్‌వైపు కదిలింది. 'తానొకటి తలిస్తే, ఆ పైవాడొకటి తలిచాడన్నట్లు ఇలా అయిందేమిటి?' అనుకున్నాడతను. ఎందుకో తన దుస్థితినెవరో గమనిస్తున్నారనిపించింది.

చటుక్కున ఇందాకటి పాప జ్ఞాపకం వచ్చి అటు చూశాడు, ఇందాకైతే కేవలం పాప మాత్రమే వుంది. ఇప్పుడు చూస్తే పాపతోబాటు ఆమె బామ్మా, తాతలు కూడా కనిపించారు. హతవిధీ అనుకుని బైక్ స్టార్ట్ చేశాడు. వెళ్ళిపోయే ముందు వినిపించాయి నవ్వులు ..... పాపతోపాటు తాతా, బామ్మలని కూడా!

*     *     *     *     *

ఆ సంఘటన జరిగిన వారం తర్వాత!

తను షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవింగ్ లోషన్‌లు తీసుకుందామని ఓ డిపార్టుమెంటల్ స్టోర్‌లోకి నడిచాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడు సేల్స్‌బాయ్.

చెప్పాడతను. అతడు తను కోరినవి తీసుకొచ్చి యిచ్చాడు! బిల్ చెల్లించి బయటకు నడచి-బైక్ స్టార్ట్ చేయబోతుంటే ఎదురుగా కన్పించింది మనస్విని- ఒక్కక్షణం ఆమెని చూసిన తను నిర్వికారంగానే మళ్ళీ కిక్ కొట్టాడు. ఆమె మొహం తిప్పుకుని,